# కేసీఆర్ పాలనపై సబ్బండ వర్గాల కన్నెర్ర

# మార్పు కోరుకుంటున్న ప్రజానీకం

పేదలు, బడుగు, బలహీన వర్గాలు, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు, కర్షకులు..ఒక్కరా ఇద్దరా...ఇలా సబ్బండ వర్గాల ప్రజలు నలభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలోనూ, నాలుగేళ్ల టీఆర్ఎస్ ఏలికలోనూ అనేక కష్టాలు పడుతూ..తాడిత, పీడిత జనులుగానే మిగిలిపోయారు. స్వరాష్ట్రం సిద్ధించినా తమ బతుకులు మారలేదని నిట్టూర్పులతో జీవితాలను నెట్టుకొస్తూనే ఉన్నారు. అనాధిగా వంచనకు గురవుతూ.. ఏళ్ల తరబడిగా మోసపోతున్న నిరుపేదల, అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ఆ మార్పును తీసుకొచ్చేందుకే కంకణబద్ధులమై ముందుకు కదిలాం. అచేతనంగా, బాధితులుగా, దోపిడీకి గురవుతున్న అభాగ్యుల జీవితాల్లో చేతనను తెచ్చే సంకల్పంతో జన చైతన్య యాత్రతో ప్రజల ముంగిటకు వెళ్లాం. ఇందులో రాజకీయం లేదు. రచ్చ అసలే లేదు. రాజీ పడి జీవిస్తున్న జీవితాల్లో ఓ వెలుగు రేఖను ప్రసరింపచేయాలన్న బలమైన సంకల్పం తప్ప.

ఆ సంకల్పానికి ప్రజలు జేజేలు పలికారు. ప్రజావాహినిలో జనచైతన్య యాత్రకు లభించిన నీరాజనాలు నిజంగా అజరామరం. అదే సమయంలో ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తీవ్రత సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రజల్లో ప్రభుత్వంపై ఎంత అసహనం, అసంతృప్తి గూడుకట్టుకుని ఉందో ఈ యాత్రలో స్పష్టంగా కనిపించింది.

పవిత్ర పుణ్యక్షేత్రం యాదాద్రిలో మొదలైన జన చైతన్య యాత్ర 14 రోజులపాటు.. 22 జిల్లాల్లో 14 పార్లమెంటు నియోజకవర్గ స్థానాల్లో, 48 అసెంబ్లీ ప్రాంతాల్లో, అదేవిధంగా 1800 గ్రామాలు, 26 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో..భారీ బహిరంగ సభలతో విజయవంతంగా కొనసాగి.. ప్రజలకు పరిపూర్ణ భరోసాను ఇచ్చింది. అడుగడుగునా ప్రజలు జనచైతన్యయాత్రకు బ్రహ్మరథం పడుతూనే తమ సమస్యల గోడు వెళ్లబోసుకున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన వంచన, ఇచ్చిన హామీలు, తుంగలో తొక్కిన వాగ్ధానాలతో ప్రజలు విసుగు చెందారు. ప్రజల మధ్య ఉండి ప్రజల సమస్యలు వింటుంటే గుండె తరుక్కుపోయింది. ఎన్నికలకు ముందు.. కేసీఆర్.. ఎన్నో హామీలిచ్చారు. వాటిలో దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కేజీ టూ పీజీ ఉచిత విద్య, నిరుద్యోగులకు ఉద్యోగాలు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జర్నలిస్టులకు ఇళ్లు, ఇలా ఒక్కటి కాదు..రెండు కాదు.. అనేక హామీలను ఇచ్చి..నాలుగేళ్లయినా వాటిని నెరవేర్చలేదని, అడుగుడుగునా ప్రజలు మొరపెట్టుకున్నారు.

సుదీర్ఘకాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ అవినీతి, కుంభకోణాలు, స్కాంలతో దేశాన్ని లూటీ చేసింది. నాలుగేళ్ల టీఆర్ఎస్ అదే ధోరణితో ప్రజావంచనకు పూనుకుంది. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అయినా.. తమ కష్టాలు తీరుతాయన్న ఆశతో..ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూశారు. ఆనాడు ఉద్యమంలో పాల్గొన్న అక్కలు, చెల్లెల్లూ..అన్నలూ, తమ్ముళ్లూ.. ఇలా..సబ్బండ వర్గాల ప్రజలు టీఆర్ఎస్ ప్రభుత్వ నయవంచన తీరును చూసి, నాలుగేళ్ల పాలన విధానాన్ని అర్థం చేసుకుని తీవ్ర మనోవేదనలో పడ్డారు. ఆ సబ్బండ వర్గాల ప్రజలకు ఇప్పుడు బిజెపి అనే ఆశాదీపం కనిపించింది. తీవ్రనిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన యువత, నిరుద్యోగులకు, భూమిలో విత్తునాటి ఆకాశం వంక ఆశగా చూసే అన్నదాతలకు ఆపన్నహస్తం అందించేందుకే, వారిలో చైతన్యాన్ని కలిగించేందుకే బిజెపి జన చైతన్య యాత్రతో వారి ముంగిట్లో నిలిచింది.

జనచైతన్య యాత్ర సకల జనులలో  కోటి ఆశలు కలిగించింది. కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చిన బిజెపి నరేంద్రమోదీ ప్రభుత్వం.. ఇక రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తే ఎలా ఉంటుందన్న ఆశ ప్రజల్లో చిగురించింది.  అందుకే యాదాద్రి మొదలు..తుంగతుర్తి వరకు ప్రజలు జనచైతన్య యాత్రకు నీరాజనాలు పలికారు.

ముఖ్యంగా కేసీఆర్ సర్కార్ నియంతృత్వ వైఖరి, కేసీఆర్ అబద్దాల పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నది ఈ యాత్రతో మరోసారి తేటతెల్లం అయింది. ప్రజలను మోసగించడానికి టీఆర్ఎస్ సర్కార్ చేస్తున్న కపట ప్రయత్నాలు, మాటల గారడితో మభ్యపెడుతున్న తీరు, ప్రచార ఆర్భాటంతో చేస్తున్న హంగామా ప్రజలకు అర్థమైంది. ప్రభుత్వం చెబుతున్నదొకటి..చేస్తున్నదొకటి అని ప్రజలే కుండబద్ధలు కొడుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు వింటుంటే కడుపు నిండిపోతుందని, చేతలు చూస్తుంటే కడుపు మండిపోతుందని, కేసీఆర్ మాటలు కోటలు దాటాయని, చేతలు తంగేళ్లు కూడా దాటడం లేదని అందరికీ అర్థమైంది. అనేక చోట్ల తమకు కనీసం తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకడం లేదు. కానీ...ఊరూరా బార్లు, బీర్లు మాత్రం దొరుకుతున్నాయని ప్రజలు ఆందోళన  చెందుతున్నారు. ఊరూరా మద్యం ఏరులై పారుతుంటే.. నిరుపేద కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్న పరిస్థితి దాపురించిందని  చాలామంది మహిళలు యాత్రలో విన్నవించుకోవడం గమనార్హం.

నాలుగేళ్ల టీఆర్ఎస్ పాలనలో మా బతుకులు ఏం మారలేదని, కూడు, గూడు, గుడ్డ వంటి కనీస వసతులు కూడా తమకు అందడం లేదని చాలాచోట్ల ప్రజలు తాము పడుతున్న అరిగోసను వివరించారు. ప్రజాసంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వం ఎక్కడలేని ప్రచారం చేసుకుంటుంది తప్ప... వాస్తవంలో వాటితో  లబ్ధి పొందింది ఏం లేదని, ఏ పథకం చూసినా.. లోటుపాట్లతో కేసీఆర్ సర్కార్ బండారం బయటపడుతూనే ఉందని చాలామంది గొంతువిప్పారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లంటూ ఇంకా మోసం చేస్తూనే ఉన్నారు. స్థలాలు చూస్తున్నామని, శంకుస్థాపనలు చేస్తున్నామని కాలం వెల్లదీస్తున్నారు. కానీ.. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇచ్చిన దాఖలాలు మాత్రం లేవు. సకాలంలో వర్షాలు కురిసినా... రైతు మోములో ఎలాంటి ఆనందం లేదు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు, పాలకుల అసమర్ధ విధానాలకు, దళారుల మోసాలకు బలై పోతూనే ఉన్నారు. పైపెచ్చు రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామంటూ.. లేనిపోని గొప్పలు చెప్పుకుంటూనే ఉన్నారు. కేసీఆర్ చెప్పే అబద్ధాలకు గిన్నిస్ బుక్ అవార్డు కూడా సరిపోదని ప్రజల వద్దకు వెళ్లినప్పుడు స్పష్టంగా అర్ధమైంది. నాలుగేళ్లు మాటల గారడితో దగా చేసిన కేసీఆర్..వచ్చేది ఎన్నికల ఏడాది కాబట్టే.. ఇప్పుడు రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఆరాటం తప్ప..చిన్న, సన్నకారు రైతులకు, పేద కౌలు రైతులకు ఏం చేస్తే ప్రయోజనం అన్న సోయి మాత్రం లేకుండా పోయింది.

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల్లో నీటికి బదులు కమీషన్లు పారుతున్నాయి. ప్రజల సొమ్ముకు కాపలా ఉండాల్సిన ప్రభుత్వ పెద్దలే.. కమీషన్లకు కక్కుర్తి పడి అవినీతి, అక్రమాలకు తెరలేపుతున్నారు. రైతులకు నీళ్లివ్వకుంటే ఓట్లు అడగం అన్న వాళ్లే.. ఇవాళ.. ప్రజల సొమ్ముతో కాంట్రాక్టర్ల జేబులు నింపుతూ...కమీషన్ల దందాను కొనసాగిస్తున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి ఎంత పెచ్చరిల్లిపోయిందంటే.. స్వయంగా ఓ మునిసిపల్ ఛైర్‌పర్సనే.. ఇంత కమీషన్ ఇవ్వాల్సిందేనని బహిరంగంగా మీడియా ముందు వాపోయేంతగా..! కాంట్రాక్టులు, కమీషన్లు, కరప్షన్‌తో కేసీఆర్ ప్రభుత్వం.. త్రీసీ సర్కార్‌గా మారిపోయిందన్నది ఎవరూ కాదనలేని నిజం. ఇదే సమయంలో ఇలాంటి ప్రభుత్వాన్నా మేం కోరుకున్నది అని తెలంగాణ ప్రజలు తీవ్రంగా మండిపడుతున్న పరిస్థితి ఉంది.

ఉమ్మడి నల్గొండ జిల్లా, పాలమూరు జిల్లాల్లో ప్రజల కష్టాలకు అంతే లేకుండా పోయింది. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య అక్కడి ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. సురక్షిత మంచినీటికి కూడా నోచుకోని అనేక మంది ప్రజలు.. ఫ్లోరోసిస్ నీటిని తాగి, కాళ్లు, చేతులు వంకర్లు పోయి కదలలేని స్థితిలో దయానీయమైన జీవితాలను అనుభవిస్తున్నారు. నాడు ఆంధ్రపాలకులను ప్రశ్నించిన కేసీఆర్.. ఇప్పుడు తాను అదే పంథాలో ముందుకు సాగుతున్నారు. గుప్పెడు మంది తెలంగాణను అడ్డుకుంటున్నారని అప్పుడు కేసీఆర్ అన్నారు. కానీ ఇప్పుడదే గుప్పెడు కేసీఆర్ కుటుంబం తెలంగాణ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి స్వార్ధపర రాజకీయాలకు ఒడిగడుతున్న మాట వాస్తవం కాదా....? ప్రాణహిత-చేవెళ్ల పథకానికి కాళేశ్వరమంటూ కొత్త పేర్లు పెట్టి.. ప్రజలను నమ్మిస్తున్నారు. కాళేశ్వరం కమిషన్ల గురించి స్వయంగా అధికారులే.. గుసగుసలాడుతుంటే.. ఈ ప్రభుత్వంలో అవినీతి ఎంత వికటాట్టహాసం చేస్తుందో ఇంకా వేరే చెప్పేదేముంది..?

ఎన్నికల్లో గెలిస్తే చాలన్న స్వార్థంతో ఇవాళ రిజర్వేషన్ల పేరుతో మైనారిటీలను మోసం చేసి, మజ్లిస్‌తో అంటకాగి రాష్ట్రంలో మతతత్వ ఓటుబ్యాంకు రాజకీయాలకు తెరలేపారు. సమాజాన్ని చీల్చి, బీసీల మధ్య, ఎస్సీల మధ్య టీఆర్ఎస్ ప్రభుత్వం చిచ్చు పెట్టేందుకు కోటి కుటిల ప్రయత్నాలు చేస్తూనే ఉంది. కానీ.. అలాంటి కుట్రలు, కుతంత్రాలకు తెలంగాణ ప్రజలు బలికాకుండా చూసేందుకు తెలంగాణ బిజెపి నడుంకట్టింది. వారిని చైతన్యం వంతం చేసేందుకే జన చైతన్య యాత్రతో వారిని తట్టిలేపింది.

రాష్ట్రంలో మూడు లక్షల వరకు ఉద్యోగ ఖాళీలు ఉంటే.. నాలుగేళ్లయినా వాటిని ఎందుకు భర్తీ చేయడం లేదు..? తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్ష, పరోక్ష పాత్ర పోషించి, ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన యువత నిరుద్యోగ సమస్యతో అల్లాడుతుంటే..ఇవిగో ఉద్యోగాలు, అవిగో ప్రకటనలంటూ.. వారి జీవితాలతో చెలగాటమాడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వం నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయింది. అందుకే యాత్రలో అడుగడుగునా యువత, నిరుద్యోగ లోకం బిజెపి వెంట అడుగులో అడుగేసి నడించింది. ఇక ఈ కేసీఆర్ సర్కార్ పాలనకు చరమగీతం పాడాల్సిందేనని బిజెపికి మద్ధతుగా పెద్ద ఎత్తున యువత యాత్రలో మమేకమై కదిలింది.

విశ్వనగరమంటూ.. హైదరాబాద్ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు చేయడంలో విఫలమయిన కేసీఆర్ ప్రభుత్వం..నగర ప్రజలనూ వంచించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడ్డప్పుడు మెరుగైన చికిత్స చేయించుకుందామంటే కనీసం మహానగరంలో సరైన ఆసుపత్రులు కూడా లేవు. ఉన్న దవాఖానాల్లో అరకొర వసతులతో అనేక సమస్యలు పేరుకుపోయాయి. తెలంగాణలో కార్పొరేట్ సంస్కృతికి చరమగీతం పాడతామని చెప్పిన కేసీఆర్... ఇప్పుడు అదే తరహా పాలనను కొనసాగించడం ఎంతవరకు సబబు అనేది ప్రజలు మెదళ్లను తొలచివేస్తుంది.

ప్రజల సమస్యలు ఎక్కడివి అక్కడే ఉండగా, నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చినా, రైతుల ఆత్మహత్యలు ఆగకపోయినా, చేనేత బతుకుల్లో మార్పు రాకపోయినా, మహిళలపై హింస నానాటికి పెరిగిపోతున్నా, సింగిల్ విండో కరప్షన్ ద్వారాలు బార్లా తెరుచుకున్నా, హిట్లర్‌ను మించిన పాలకుడిగా సీఎం కేసీఆర్ నియంతృత్వ దోరణితో పాలన చేస్తున్నా, ధర్నా, నిరసనలు తెలిపే అవకాశం కూడా లేకుండా చేసినా.. తెలంగాణ దేశంలోనే నెంబర్ ఎలా అయిందన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏమీ చేయకుండానే తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ అయిందని చెప్పుకోవడం టీఆర్ఎస్ పాలకులకే చెల్లిందేమో....? మద్యం అమ్మకాల్లో తెలంగాణ నెంబర్‌వన్, పేద ప్రజల ఆరోగ్యం పణంగా పెట్టి మద్యం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం శోచనీయం.

4 కోట్ల తెలంగాణ ప్రజలను కేవలం కేసీఆర్ కుటుంబంలోని ఐదుగురే పాలించాలా…? తెలంగాణ ప్రజలకు పప్పూ బెల్లాలిచ్చి..ముడుపులు మీ జేబులో వేసుకుంటారా…? అందుకే… ఇకపై సాగదు మీ నియంతృత్వ దోరణి. ఇకపై చెల్లదు మీ నిరంకుశ పాలన అంటూ బిజెపి మీ బండారం బయట పెడుతోంది.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పేదలకు కేంద్రం ఇళ్లిస్తే..అవి వారికి ఇవ్వకపోగా.. ఆ నిధులే మీవేనంటారా..? మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులకు కేంద్రం వేల కోట్ల నిధులు ఇస్తే.. ఇచ్చిన తావు కూడా మరిచి.. కేంద్రం ఇచ్చిందని కూడా చెప్పరా…? పైపెచ్చు కేంద్రం ఏమీ ఇవ్వడం లేదంటూ ప్రజలకు అబద్ధాలు చెబుతారా…? దమ్ముంటే.. కేంద్రం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని.. కాకమ్మ కథలతో కాలం వెళ్లదీస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. కేంద్రం ఇచ్చిన నిధులపై..టీఆర్ఎస్ ప్రభుత్వం చర్చకు రావాలని జనచైతన్య యాత్ర వేదికలపై పలుమార్లు డిమాండ్ చేసినాం. అయినా…కేసీఆర్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు గమ్మునుందంటే.. దీని నిగూడార్థం ఏమిటో ప్రజలకు ఇప్పటికే అర్థమై ఉంటుంది.

**డాక్టర్ కె లక్ష్మన్, ఎమ్మెల్యే,**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ**